క్లుప్తంగా

కొండగట్టుకు అంజన్న స్వాముల పాదయాత్ర



కొండగట్టుకు బయలుదేరిన స్వాములు

దహెగాం: మండల కేంద్రంలోని ఆంజనేయ దీక్షాపరులు గురువారం కొండగట్టుకు పాదయాత్రగా బయలు దేరారు. స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం పాదయాత్రగా సుమారు 12 మంది తరలివెళ్లారు. సోమవారం సాయంత్రం వరకు కొండగట్టుకు చేరుకొని మంగళవారం తెల్లవారు జామున మాల విరమణ చేస్తామని వారు పేర్కొన్నారు. కాటారపు శ్రీను, సోమిశెట్టి రాకేశ్, కొండు సాయి, సమ్మయ్య, పంబాల చంద్రు, పెంటయ్య తదితరులు ఉన్నారు.

‘స్పీడ్ బ్రేకర్ల నిర్మాణాలు ఆపాలి’

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని లారీ చౌరస్తా నుంచి ఎస్పీఎం వర్కర్స్ గేటు వరకు కొత్తగా నిర్మిస్తున్న స్పీడ్‌బ్రేకర్ల నిర్మాణాలను వెంటనే ఆపాలని సీపీఎం పార్టీ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 500 మీటర్లు కూడా లేని రోడ్డుకు ఇప్పటికే 10 స్పీడ్ బ్రేకర్లు వేశారని, మళ్లీ కొత్తగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం లేని చోట స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారని, దీంతో ద్విచక్ర వాహనదారులకు వెన్నుపూస సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

బీజేపీలో చేరిన బీఎస్పీ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: చింతలమానెపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకులు గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బీజేపీలో చేరారు. బీఎస్పీ జిల్లా ఆర్గనైజర్ దుర్గం జనార్దన్, అంబేద్కర్ కమిటీ సభ్యులు దుర్గం బాబురావు, ఉపాధ్యక్షులు శివరాం, కార్యదర్శి రాజలింగు, నగేశ్, రమేశ్‌లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు తుకారాం, పవన్, మోహన్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: ప్రతి ఒక్కరు బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. పీఎం జీవన జ్యోతి బీమా యోజన లబ్ధిదారులు మండలంలోని గురుడుపేట్ గ్రామానికి చెందిన ఆలం సురేశ్‌కు గురువారం రూ. 2 లక్షల చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మనోహర్, రాజేశ్, భాస్కర్, గోపి, మోరేశ్వర్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న ఫైర్‌సిబ్బంది

ఆసిఫాబాద్: అగ్నిమాపక వారోత్సవాల్లో 5వ రోజులో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని పెట్రోల్ పంపులు, భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు చోటు చేసుకున్నపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, గ్యాస్, వాహన వినియోగదారులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

నార్నూర్: మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్‌ను మానవహక్కుల కమిషన్ మండల అధ్యక్షుడిగా నియమకమయ్యారు. గురువారం కమీషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంగల పెళ్లి హుస్సేన్ చేతుల మీదుగా నియమాక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య దేశంలో హక్కులు పొందే అ.దికారం ప్రతిఒక్కరికీ భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రతిఒక్కరూ తమ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు.

‘వేలం’ లేనట్లేనా..?

- ముగిసిన వారసంతల వేలం గడువు
- జీపీల ఆధ్వర్యంలో నిర్వహణ
- రుసుము వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



దహెగాంలో కొనసాగుతున్న వారసంత

దహెగాం: గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వారసంతల్లో ప్రజలు వారానికి సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. వారసంతలను పంచాయతీల ఆధ్వర్యంలో ఏటా తైబజార్ వేలం వేస్తుంటారు. వేలంలో వారసంతలను దక్కించుకోవడానికి కాంట్రాక్టర్‌లు పోటీ పడుతుంటారు. ఏటా మార్చి మొదటి వారంలోనే తైబజార్‌ల వేలం నిర్వహిస్తారు. గత సంవత్సరం వేసిన వేలం గడువు పూర్తయ్యి సుమారు 20 రోజులు కావస్తున్నా ఇంకా వేలం వేయడం లేదు. సంతలో దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్న చిరువ్యాపారుల వద్ద నుంచి పంచాయతీ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో వసూలు చేసిన రుసుము పక్కదారి పట్టే అవకాశాలు ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

మండలంలో రెండు వారసంతలు..

మండల కేంద్రంతో పాటు, కుంచవెల్లి గ్రామంలో వారసంతలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారసతం ఉండగా, ఆదివారం మండలంలోని కుంచవెల్లి గ్రామంలో సంత కొనసాగుతుంది. ఒక్కో వారసంత తైబజార్ వేలంలో రూ. 2 నుంచి రూ. 2.50 లక్షల వరకు వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుంది. ప్రతీ వారం సంతలో దుకాణాలు పెట్టుకున్న చిరు వ్యాపారుల నుంచి రూ.10 నుంచి రూ.60 వరకు ఒక్కో దుకాణానికి రుసుము వసూలు చేస్తున్నారు. దీంతో వారానికి ఒక్కో సంతలో రూ.4 నుంచి రూ.6 వేల వరకు వసూలు అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే గత రెండు వారాలుగా పంచాయతీ సిబ్బందే రుసుము వసూలు చేస్తున్నారు. ఆ డబ్బులను పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. వసూలైన డబ్బులు పూర్తి స్థాయిలో పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారా అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

సార్వత్రిక ఎన్నికలు అడ్డంకి..

ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలుల్లో ఉన్న నేపథ్యంలో తైబజార్‌ల వేలం వేయలేక పోతున్నామని అధికారులు పేర్కొంటున్నారు. జూన్ రెండో వారంలో ఎన్నికల కోడ్ ముగియగానే తైబజార్‌ల వేలం వేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎన్నికల కోడ్ ముగిసే నాటికి పంచాయతీ ఆధ్వర్యంలోనే సంతలో ఏర్పాటు చేసే చిరు వ్యాపారుల వద్ద నుంచి రుసుము వసూలు చేయనున్నారు. వసూలు చేసిన రుసుము పంచాయతీ అభివృద్ధికి వెచ్చించనున్నారు. ప్రతి వారం సంత నుంచి ఎంత ఆదాయం వస్తుందో రికార్డులో ఉండాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వసూలైన రుసుము పక్కదారి పట్టకుండా అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాబోయ్ ఎండ!



దహెగాం: రోజురోజుకు ఎండ తీవ్రత పెరిగిపోతుంది. గురువారం మండల కేంద్రంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో బాబోయ్ ఎండ అంటూ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలు ఉదయం 10 గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు రుమాలు, గొడుగు సాయంతో వెళ్తున్నారు. ఇంకా ఎన్ని రోజులు ఎండలు అంటూ భయాందోళన చెందుతున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న గుడ్లబోరి గ్రామస్తులు

కౌటాల: కౌటాల –గుడ్లబోరి బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని గుడ్లబోరి ఎంపీటీసీ ధనురేకార్ వసంత్‌రావు అన్నారు. గురువారం గ్రామ యువకులు రోడ్డు పనులు పూర్తి చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల క్రితం బీటీ రోడ్డుపై ఉన్న తారు తొలగించి గుత్తేదారు కంకర పోశారన్నారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దుమ్ముతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుపై తారు వేయాలన్నారు. లేకుంటే రోడ్డుపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. మాజీ సర్పంచ్ పాలే రాందాస్, వాయుకుమార్, సునీల్, వంశీ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని పోస్టర్‌ను గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే హరీశ్ బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్, విశాల్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు వెంకన్న మాట్లాడుతూ ఈనెల 23న హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

‘బహిరంగ క్షమాపణలు చెప్పాలి’



మాట్లాడుతున్న నాయకులు

బెజ్జూర్: రాష్ట్ర మంత్రులు ఉత్తం కుమార్‌రెడ్డి, సీతక్కలపై నిరాధార ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు బూస శంకర్‌లు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హరీశ్‌బాబు చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ హకీం, మండల కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, ఎంపీటీసీ వెంకన్న, నాయకులు సకారాం, నరేందర్ గౌడ్, మహేశ్, సతీశ్, షౌకత్‌అలీఖాన్, బాపూరావు, మాందూరి శంకర్, శ్రీనివాస్, పెంటయ్య, నారాయణ, సుంకరి విష్ణుమూర్తి, శైలేష్, అబ్దుల్ రసిద్, గంగులు, మిర్యాల కృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని పెద్దబండ వాగు సమీపంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక సాయి బాబ ఆలయం నుంచి పట్టణంలోని పలు వీధుల గుండా అయ్యప్పస్వామి విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఈనెల 21న అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపన ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 19, 20, 21 తేదీల్లో నూతన ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విగ్రహ ప్రతిష్టాపన పూజలు, భజన కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



బాధితుల వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ

ఆసిఫాబాద్‌రూరల్: గాలి బీభత్సంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. గురువారం మండలంలోని బూర్గుడలో గాలివానకు ఇంటిపై కప్పులు లేచిపోవడంతో నష్టం జరిగిన కుటుంబాలతో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు విశాల్, శివ, గణేశ్ తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి మృతి

బూర్గుడ గ్రామానికి చెందిన లోకండే చిన్నక్క (69) గాలి బీభత్సంతో ఇంటిపై కప్పు కూలగా గాయాలపాలైంది. ఈక్రమంలో వృద్ధురాలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కనుల పండువగా శ్రీరాముడి పట్టాభిషేకం



పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న రవిప్రసాద్

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయం ప్రాంగణంలో గురువారం రాత్రి శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేక కార్యక్రమాన్ని భక్తులు కనుల పండువగా నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, ఆలయ కోశాధికారి చంద్రశేఖర్‌లు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కార్యదర్శి శేషశయనరావు, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

మురుగు నీటికి దారేది..!



మురుగు కాలువకు అడ్డంగా వేసి ఉన్న ఇసుక బస్తాలు

వాంకిడి: మండల కేంద్రంలోని పోస్టాఫీసు కాలనీలో గల బండెవాడలో మురుగు నీరు వెళ్లేందుకు డ్రెయినేజీ లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువ నిర్మాణం కొంతవరకే చేపట్టి వదిలేయడంతో మురుగు వెళ్లేందుకు దారి లేక డ్రెయినేజీ నిండిపోతుంది. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం వైపు యువత

- భజనలతో మారుమోగుతున్న గిరిసీమలు
- ఎటు చూసినా హనుమాన్ స్వాములే
- పల్లెల్లో పెరుగుతున్న భక్తిభావం



దీక్షలో తండ్రులతో కొడుకులు



ధ్యానం చేస్తున్న స్వాములు

కెరమెరి: జిల్లాలోని యువత ఆధ్యాత్మిక భావం వైపు అడుగులు వేస్తున్నారు. హనుమాన్ జయంతి పురస్కరించుకొని 41 రోజుల నుంచి ఆంజనేయ స్వామి దీక్షలు చేపట్టి భక్తిభావంలో నిమగ్నమవుతున్నారు. ఈ తరుణంలో అనేక గ్రామాల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా కొందరు 41, 21, 11 రోజులు ఆంజనేయ స్వామి దీక్షలు చేపట్టారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లో మొత్తం 109 మంది ఆంజనేయ స్వామి దీక్షలు స్వీకరించారు. అయితే తండ్రులతో పాటు కొందరు కుమారులు కూడా దీక్షలు తీసుకోవడం విశేషం.

కొద్ది రోజులైనా నిష్టగా..

కొద్దిరోజులైనా నిష్టగా, నియమాలతో ఉండాలని యువకులు భావిస్తున్నారు. దీక్షలు చేపట్టే కాలంలో ఒంటిపూట భోజనం, చల్లని నీటితో స్నానాలు చేయడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. దీక్షలు చేపట్టే స్వాములు ప్రతీ ఒక్కరు తెల్లవారుజామున 4 గంటలకు మేల్కొని స్నానాలు చేసి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళహారతులు, మాలజపం, ఆంజనేయ స్వామి విగ్రహాల ముందు కూర్చొని వివిధ రకాల పాటలు పాడుతూ భజనలు చేయడం వంటి కార్యక్రమాలతో గిరిసీమలు మారుమోగుతున్నాయి. స్వాములు నగర కీర్తనలు చేస్తూ భక్తిభావాన్ని చాటుతున్నారు. కెరమెరి మండల కేంద్రంతో పాటు కెలి(కే), సాంగ్వి, గోయేగాం, భోలాపటార్, లెండిగూడ, జిల్లాలోని అనేక మండలాల్లో దీక్షలు స్వీకరించారు.

ఆరోగ్యానికి మంచిది



ప్రతీరోజు క్రమం తప్పకుండా పూజలు చేయడం వల్ల దేవునిపై నమ్మకం పెరుగుతుంది. దీక్షల్లో చేపట్టే అలవాట్లు ఆరోగ్యానికి చాలా మంచివి.

\- వాడై ప్రకాశ్, గురుస్వామి

ఏదో తెలియని అనుభూతి



దీక్ష కాలంలో ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. దేవునిపై భక్తిభావం పెరుగుతుంది. ఒంటి పూట భోజనం చేయడంతో పాటు పూజల్లో పాల్గొంటున్నాను.

\- రంగు శ్రీకాంత్, కన్నెస్వామి

దీక్షలతో పునీతం



దీక్షలతో పల్లెలు పునీతమవుతున్నాయి. అంతా నిష్టగా ఉంటున్నాం. మనసుకు ప్రశాంతతతో పాటు కార్యాల్లో ఫలితాలు కనిపిస్తున్నాయి. నేను సాయిదీక్ష కూడా స్వీకరిస్తాను.

\- భోజన్న, కెరమెరి

చెక్‌పోస్టు ప్రారంభం



చెక్‌పోస్టు ప్రారంభిస్తున్న ఎస్సై

దహెగాం: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో మండలంలోని జిల్లా సరిహద్దు గ్రామం కల్వాడ వద్ద చెక్‌పోస్టును ఎస్సై రాజు పునఃప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం రవాణా అరికట్టడానికి చెక్‌పోస్టును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామన్నారు. రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగదుకు ఆధారాలు ఉండాలన్నారు.

ఎడారిగా ప్రాజెక్టు!



దహెగాం: వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని కల్వాడ గ్రామ సమీపంలో ఎర్రవాగు, నల్లవాగులపై చిన్నతరహా ప్రాజెక్టు నిర్మించారు. రెండు వాగులపై రెండు మత్తడులు ఉన్నాయి. వర్షాకాలంలో ఎర్రవాగులోకి వరద వస్తే నల్లవాగులోకి వరద నీరు చేరేలా, నల్లవాగులోకి వరద వస్తే ఎర్రవాగులోకి వరద చేరేలా లింకు కెనాల్ నిర్మించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత వల్ల నల్లవాగులో చుక్క నీరు లేకుండా ఇంకి పోయి ఎడారిలా మారింది.

చేతిపంపునకు మరమ్మతు



బోరింగ్ నీటిని పరిశీలిస్తున్న ఎంపీపీ మోతీరాం

కెరమెరి: మండలంలోని సాకడ చౌరస్తా వద్ద గడిచిన ఆరు సంవత్సరాలుగా మరమ్మతులు లేక నిరుపయోగంగా ఉన్న చేతిపంపునకు గురువారం ఎంపీపీ పెందోర్ మోతీరాం మరమ్మతులు చేయించారు. సుమారు 15 గ్రామాలకు చెందిన ప్రజలు చౌరస్తావద్ద ఆగి బస్సుల కోసం వేచిచూస్తారన్నారు. వేసవికాలం నేపథ్యంలో వారంతా దప్పికతో ఇబ్బందులు పడకుండా చేతిపంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.